క్లుప్తంగా

కొనసాగుతున్న ఎల్లమ్మ జాతర



కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ జాతరలో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలో కొత్లాపూర్ గ్రామ శివారులోని శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర కొనసాగుతుంది. శుక్రవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. డప్పువాయిద్యాలతో, మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జూన్ 11వ తేదీ ఏరువాక పౌర్ణమితో ఎల్లమ్మ జాతర ముగియనుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నవీన్‌రెడ్డి, ఈవో శేఖర్‌గౌడ్, మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ సర్పంచు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధి చెందాలి

ఏపీఎం ఆనంద్‌కుమార్



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

తాండూరు రూరల్: స్వయం సహాయక సంఘాల్లో పని చేస్తున్న మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని అభివృద్ధి చెందాలని ఏపీఎం ఆనంద్‌కుమార్ అన్నారు. శుక్రవారం తాండూరు మండలం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజక వర్గంలోని పెద్దేముల్, బషీరాబాద్, యాలాల, తాండూరు స్వయం సహాయక సంఘాల మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కోటి మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఆసక్తిగల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

తడి,పొడి చెత్తను వేరు చేయాలి



ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతగిరి: తడి,పొడి చెత్తను వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి అందజేయాలని మున్సిపల్ డీఈ రాకేశ్ పేర్కొన్నారు. తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని ఆయన అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లో వంద రోజుల ప్రణాళికలో భాగంగా అవగాహన నిర్వహించారు. కుక్కకాటు నివారణ తదితర అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, మేనేజర్ విఠల్, రవి, కృపాకర్, వెంకటేష్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ యేసుదాస్, ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్ ఎస్‌ఐగా ప్రశాంత్ వర్ధన్

తాండూరు రూరల్: పెద్దేముల్ ఎస్‌ఐగా ప్రశాంత్ వర్ధన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఇక్కడ పని చేసిన శ్రీధర్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. టాస్క్ ఫోర్స్ విభాగంలో పని చేస్తున్న ప్రశాంత్‌ను పెద్దేముల్ ఎస్‌ఐగా నియమించనున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. నేడో, రేపో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.

ఘనంగా ప్రీ స్కూల్ డే



మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్ శివలక్ష్మి

మొయినాబాద్‌రూరల్: ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్య అభ్యసించేలా తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని చాకలిగూడ అంగన్‌వాడీ టీచర్ శివలక్ష్మి సూచించారు. శుక్రవారం కేతిరెడ్డిపల్లి అనుబంధ గ్రామం చాకలిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లు నిండిన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గర్భిణులకు సీమంతం చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

షాద్‌నగర్: ప్రపంచ యోగా దినోత్సవానికి సంబంధించి ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. జూన్ 21న జాతీయ దినోత్సవంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని కోరారు. డాక్టర్ షీలా, డాక్టర్ జయప్రకాష్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, నాయకులు తిరుపతిరెడ్డి, ఖదీర్, నర్సింలు, ఫార్మాసిస్టులు బాబు, చిన్మయరంగ, వరలక్ష్మి, ఈశ్వరి, యోగాశిక్షకుడు పాల్గొన్నారు.

జాప్యం ఎందుకు?

- జనన, మరణ పత్రాల జారీలో తప్పని ఎదురు చూపులు
- నెలల తరబడి కార్యాలయాల్లో దరఖాస్తులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

నవాబుపేట: జనన, మరణ పత్రాల జారీలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. సకాలంలో సర్టిఫికెట్లు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ దానికి ఆధార్ తప్పనిసరి కావడంతో ఆ కార్డులో ఏమైన లోపాలు ఉంటే దాన్ని సరి చేసుకునేందుకే నానా తంటాలు పడాల్సి వస్తోందని దరఖాస్తుదారులు చెబుతున్నారు. జనన, మరణ, భూముల పట్టాలకు, బ్యాంకుల్లోని నగదు తీసుకునేందుకు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరయ్యాయి. అంతే కాకుండా విద్యార్థులకు పాఠశాలల్లో నమోదు చేసిన పేరు, ఆధార్‌లో ఉన్న పేరు, పుట్టిన తేదీలో తేడా ఉంటే సరిచేసుకునేందుకు మీ సేవలో దరఖాస్తులు చేసుకోవాలి. అనంతరం తహసీల్దార్ కార్యాలయాల్లో సదరు అధికారులకు అందజేయాలి. వాటికి విచారణ పేరుతో అప్రూవల్ చేయకుండా నెలలు గడుపుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి దరఖాస్తులను ఆర్డీవో కార్యాలయానికి పంపితే చిన్న చిన్న కారణాలతో తిరిగి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వస్తోందని చెబుతున్నారు.



జనన ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న రశీదు

అంగన్‌వాడీ నుంచి..

మరణ ధ్రువీకరణ పత్రానికి పాత ఫొటో, సమాధి ఫొటో, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలితో పాటు పంచాయతీ కార్యదర్శితో సంబంధిత పత్రాలు అఫిడవిట్ చేయించుకోవాలి. తర్వాత మీ సేవలో దరఖాస్తు చేసి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలి. వాటిని విచారణ చేసి ఆర్డీవో కార్యాలయానికి పంపుతున్నారు. అంతేకాకుండా మరణించిన వ్యక్తి అంత్యక్రియలకు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు హాజరైనట్లు, వారి ఐడీ నంబర్‌తో ధ్రువీకరించాలనే నిబంధనలతో ఆర్డీవో కార్యాలయ అధికారులు తిరస్కరిస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు దరఖాస్తు దారులు పేర్కొన్నారు. ధ్రువ పత్రాల జారీ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే జనన, మరణ పత్రాలను ధ్రువీకరించే విషయంలో సిబ్బంది ఆలస్యం చేయకుండా సత్వరమే సర్టిఫైడ్ చేసేవిధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రెండు నెలలు గడిచినా..



మా కూతుళ్ల జనన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసి రెండు నెలలు గడిచింది. అయినప్పటికీ సంబంధిత పత్రాలు ఇప్పటి వరకు రాలేదు. అధికారులను పలుమార్లు అడిగినా వస్తాయనే బదులిస్తున్నారు. సర్టిఫికెట్ల కోసం ప్రతిరోజు తిరగాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– వెంకట్‌రెడ్డి, రైతు, దాతాపూర్

సత్వరమే చర్యలు



ఇటీవలే నవాబుపేట తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించాను. ఇది వరకు ఏం జరిగిందో తెలియదు. కానీ చాలా ఫైళ్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. వాటన్నింటిని పరిశీలించి ఆర్డీఓ కార్యాలయానికి పంపిస్తున్నాను. ఇక నుంచి జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేయం.

– బుచ్చయ్య, తహసీల్దార్, నవాబుపేట

కొనుగోళ్లు త్వరగా చేయాలి

తహసీల్దార్ వెంకటస్వామి



జుంటుపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం వివరాలు తెలుసుకుంటున్న వెంకటస్వామి

యాలాల: ఆయా కేంద్రాల్లోని వరిధాన్యాన్ని రైతుల నుంచి త్వరగా కొనుగోలు చేయాలని యాలాల తహసీల్దార్ వెంకటస్వామి పేర్కొన్నారు. మండలంలో జుంటుపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఇటీవల అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై తహసీల్దార్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు రైతుల నుంచి సేకరించిన బస్తాలు ఎన్ని? తూకం కానీవి ఎన్ని ఉన్నాయి? బిల్లులు చేసిన వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం నుంచి పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ మేనేజర్ సలాం, ఆర్ఐ వేణు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



ఘనపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నేతలు

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

కుల్కచర్ల: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల పరిధిలోని కుల్కచర్ల, చాపలగూడెం, ఘనపూర్, సాల్వీడు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను దశల వారీగా పరిష్కరిస్తుందన్నారు. ఇళ్లు మంజూరు కానీ లబ్ధిదారులు నిరాశ చెందొద్దన్నారు. అర్హులకు విడతల వారీగా మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, జోగు వెంకటయ్య, నాయకులు కుమ్మరి స్వామి, అంజిలయ్య, గోపాల్ నాయక్, భరత్‌కుమార్ రెడ్డి, బచ్చిరెడ్డి, ఆనందం, రాంచంద్రయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గా సిద్ధం



తాండూరు పట్టణంలోని ముర్షద్ దర్గా వద్ద ప్రార్థనా స్థలం

తాండూరు: బక్రీద్ సందర్భంగా తాండూరు పట్టణంలోని ఈద్గా మైదానాలు ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధం చేశారు. శనివారం ముస్లింలు నమాజ్ చదవడానికి వేలాది సంఖ్యలో హాజరు కానున్నారు. ప్రార్థన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేశారు. తాండూరు పట్టణంలో మొత్తం మూడు ఈద్గా మైదానాలు అందుబాటులో ఉన్నాయి. ముర్షద్ దర్గా, చెన్‌గేష్‌పూర్ రోడ్డు మార్గంలోని ఈద్గా, ఖాంజాపూర్ గేట్ సమీపంలోని ఈద్గాను బక్రీద్ ప్రార్థనలకోసం కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి నిర్వహించనున్న ప్రార్థనలకు పోలీస్ అధికారులు బందోబస్తు నిర్వహించనున్నారు.

బీసీ సేన మండల మహిళా కోశాధికారిగా సునీత

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాలలో జాతీయ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జలజ ఆధ్వర్యంలో శుక్రవారం బీసీసేన మహిళా విభాగం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీసీ సేన మండల మహిళా కమిటీ కోశాధికారిగా విఠ్యాలకు చెందిన సునీతను ఎంపిక చేశారు. అనంతరం ఆమెకు నియమాక పత్రం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శివ, చంద్రశేఖరప్ప, జయ శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రవంతిరాజ్, వెంకటేష్, రాజు, నర్సింలు, రాములు, యాదయ్య, విష్ణు, శ్రీశైలం, రాములు యాదవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న మండల విద్యాధికారి పురందాస్

చేవెళ్ల: విద్యార్థులకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు అందజేస్తున్నామని మండల విద్యాధికారి ఎల్.పురందాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు పుస్తకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 24 వేలకుపైగా పాఠ్యపుస్తకాలు వచ్చాయని.. మరో రెండు రోజుల్లో పూర్తిగా వస్తాయని వివరించారు.

'లంపిస్కిన్'ను అరికట్టేందుకు టీకా

మొయినాబాద్ రూరల్: లంపిస్కిన్ వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం ఉచితంగా టీకా వేస్తోందని అమ్డాపూర్ పశువైద్యాధికారి దేవి రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె గ్రామంలో పలు పశువులకు టీకా ఇచ్చారు. ఈ సందర్భంగా దేవి రెడ్డి మాట్లాడుతూ.. పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాలదిగుబడి పెరుగుతుందని.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్ రెడ్డి



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతుందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సదానంద్ రెడ్డి తెలిపారు. వికసిత్ భారత్ సుపరిపాలనకి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రధాన మంత్రి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం వికారాబాద్ మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ద్యాచారంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోదీ పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. భారత దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతుందన్నారు. దేశ అభివృద్ధిని చూసి ప్రపంచ దేశాలు కీర్తిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ అమరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, గోపాల్, శ్రీశైలం, యాదయ్య, లింగం, రవీందర్ చారి, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవం



ప్రత్యేక పూజలో పాల్గొన్న గ్రామస్తులు

షాబాద్: మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవాలు గ్రామస్తులు వైభంగా నిర్వహించారు. శ్రీను పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనమెత్తి ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయికి నైవేద్యం సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమ్మలి సుబ్రమణ్యేశ్వరి, రవీందర్, జెడ్పీటీసీ మాజీ జడల లక్ష్మీ రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అశోక్, నాయకులు రవీందర్, రాహుల్‌గుప్తా, గ్రామస్తులు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికే భూ భారతి

డిప్యూటీ తహసీల్దార్ మహేశ్



బంట్వారం: రొంపల్లిలో దరఖాస్తులు పరిశీలిస్తున్న డీటీ మహేశ్

బంట్వారం: సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని డిప్యూటీ తహసీల్దార్ మహేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రొంపల్లి, మంగ్రాస్‌పల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల నుంచి 73 దరఖాస్తులు స్వీకరించారు. వాటిని క్షేత్రస్థాయిలో విచారణ చేయించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాంగోపాల్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి మండలంలో..

కోట్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 18 దరఖాస్తులను స్వీకరించారని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడుతాయన్నారు.

మొదటి రోజు బడిబాట

- ప్రైవేటుకు దీటుగా బోధన
- విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యం
- తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, ఎంఈఓలు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన చేపడుతున్నారని ఎంఈఓలు వివరిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బడిబాటలో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, బోధన తదితర అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓలు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

బొంరాస్‌పేట: ప్రభుత్వం శుక్రవారం ప్రారంభించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట మొదటి రోజు మండలంలో ముమ్మరంగా సాగింది. ఎన్కేపల్లి, రేగడిమైలారం గాజులకుంటతండా, టేకులగడ్డ తండా తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. బడీడు పిల్లలు బడిలో చేరాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, బాకారం చంద్రశేఖర్, మల్లయ్య పాల్గొన్నారు.



యాలాల: దేవనూరులో నిర్వహించిన బడిబాటలో ఎంఈఓ రమేష్ తదితరులు

బడి బయట ఉండొద్దు

యాలాల: బడి బయట పిల్లలు ఉండొద్దని మండల విద్యాధికారి రమేశ్ పేర్కొన్నారు. బడిబాటలో భాగంగా దేవనూరులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను వివరించారు. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యా బోధన చేపడుతారన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

బంట్వారం: విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోట్‌పల్లి మండలంలో..

కోట్‌పల్లిలో నిర్వహించిన బడిబాటలో ఎంఈఓ చంద్రప్ప మాట్లాడారు. పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ఎంపీడీఓ డానియల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే సౌకర్యాలు

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. పట్టణ కేంద్రంతో పాటు ఆయ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట నిర్వహించారు. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో పాటు డిజిటల్ బోధన చేయనున్నామన్నారు. ఉచితంగా పుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేస్తామన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

నవాబుపేట: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి అబ్దుల్ రెహమాన్ సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బడిబాటలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందనే నమ్మకాన్ని తల్లిదండ్రులకు కలగజేయాలన్నారు. తహసీల్దార్ బుచ్చయ్య, ఎంపీడీవో అనురాధ తదితరులు పాల్గొన్నారు.



పరిగి: రూప్‌ఖాన్‌పేట్ బడిబాటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న విద్యాధికారి గోపాల్, ఉపాధ్యాయులు



బంట్వారం: మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు



నవాబుపేట: ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈఓ అబ్దుల్ రెహమాన్



బొంరాస్‌పేట: బడిబాట ప్రచారంలో ఉపాధ్యాయులు